# 2008, ఫిబ్రవరి 16వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలికి 2008-09 సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పిస్తూ గౌరవనీయులైన ఆర్థిక శాఖ మంత్రి, శ్రీ కె. రోశయ్యగారు చేయు ప్రసంగం

*గౌరవనీయ అధ్యక్షా!*

1. 2008-09 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బడ్జెట్‌ను సమర్పిస్తున్నాను.

2. గత నాలుగు సంవత్సరాలలో వరుసగా 5వ సారి రాష్ట్ర 12వ శాసనసభకు బడ్జెట్‌ను సమర్పిస్తున్నందుకు గర్విస్తున్నాను. మా ప్రభుత్వం ఎటువంటి కొత్త పన్నులను ప్రతిపాదించకుండా గత నాలుగు బడ్జెటులను సమర్పించగలిగినందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. ఈ సారి కూడా ఎటువంటి కొత్త పన్నులను విధించాలని గానీ, ప్రస్తుతమున్న పన్నులను పెంచాలని గానీ ప్రతిపాదించక పోవడం గౌరవ సభ్యులకు సంతోషం కలిగిస్తుందని భావిస్తున్నాను. వరుసగా నాలుగవ సంవత్సరానికి కూడా భారతీయ రిజర్వు బ్యాంకు నుండి ఎటువంటి సాధనోపాయాల అడ్వాన్సులను తీసుకోకుండా రాష్ట్రఆర్థిక అవసరాలను నిర్వహించగలుగుతున్నాం. విద్యుత్ వినియోగదారులలోని ఏ వర్గం వారికి విద్యుత్ టారిఫ్‌ను గత నాలుగు సంవత్సరాల కాలంలో పెంచకపోవడమనేది రాష్ట్ర చరిత్రలోనే సుదీర్ఘకాలమని గౌరవ సభ్యులకు తెలుసు. వాస్తవంగా, రాష్ట్రం ప్రతి సంవత్సరం రైతులకు ఉచితంగా 1,000 కోట్ల యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేయగలుగుతున్నది. పారిశ్రామిక విద్యుత్ చార్జీలను తగ్గించాము. సంక్షేమ పింఛనుదార్ల సంఖ్య 47.89 లక్షలకు చేరింది. ఆహార సబ్సిడీ కూడా బాగా పెరిగింది. గత నాలుగు సంవత్సరాలలో గృహ నిర్మాణం, సాగునీటి రంగాలకు బడ్జెట్ కేటాయింపులు కూడా అనేక రెట్లు పెరిగాయి. ఆర్థికపరంగానూ, సంఖ్యాపరంగానూ ఇదివరకెన్నడూ చేయనన్ని కార్యక్రమాలను రైతులు, చేనేతకారులు, చేతివృత్తుల మరియు ఇతర నిరుపేద వర్గాలకు సహాయపడటానికి భారీ ఎత్తున చేపట్టాము. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినప్పటికి, దశాబ్దకాలం

అనగా 1994 నుంచి 2004 వరకు రాష్ట్ర ఆర్థికాభివృద్ధిపై దుష్ప్రభావాన్ని చూపిన రెవిన్యూ లోటును పూడ్చి, 2006-07 సంవత్సరం నాటికి సుమారు 2,800 కోట్ల రూపాయల రెవిన్యూ మిగులు సాధించడం గౌరవ సభ్యులకు సంతోషం కల్గిస్తుందని భావిస్తున్నాను.

3. 2004, మే నాటికి దశాబ్ద కాలంగా ఆర్థిక వృద్ధి రేటు 5.5 శాతం దగ్గర స్తంభించిపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆర్థిక వ్యవస్థను ప్రగతి పథంలోకి నడపడమనేది మా ప్రప్రథమ సవాలుగా నిలిచింది. గౌరవనీయులైన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి, శ్రీ పి. చిదంబరం, తన గత బడ్జెటు ప్రసంగం ముగింపు పేరాలలో ఆర్థికవృద్ధి, వృద్ధి సంబంధిత విషయాల గురించి ప్రస్తావించారు. అధిక స్థూల దేశీయ ఉత్పత్తి అంటే అధిక పన్నులు, పన్నేతర రాబడులు అని అర్థం. రాష్ట్ర రాబడులు ఎల్లవేళలా జిడిపికి దామాషాగా ఉంటాయి. ప్రభుత్వానికి అధిక ఆదాయం సమకూరడం వలన ఉత్పాదకత పెంచే మూలధన ఆస్తులపై వ్యయం పెరిగి మానవాభివృద్ధి స్థాయి పెరగడానికి దోహదపడుతుంది. సామాజికంగా, ఆర్థికంగా రెండింటి దృష్ట్యా సమానత్వం లేకుండా జరిగే వృద్ధి అపాయకరమైనది. అదే సమయంలో, వృద్ధి లేకుండా సమానత్వం సాధించడం అసాధ్యం. అధికవృద్ధికి పెట్టుబడులే ఆధారం. సంవత్సరం సంవత్సరం ప్రణాళికా కేటాయింపులను గణనీయంగా పెంచడం ద్వారా మునుపెన్నడూ లేని రీతిలో ప్రభుత్వ పెట్టుబడిని పెంచాం. ఈ పెట్టుబడులు రాష్ట్రం రెండంకెల వృద్ధిరేటు సాధించడానికి దోహదపడ్డాయి.

4. సంతోషకరమైన విషయమేమిటంటే గత సంవత్సరంతోను, జాతీయ స్థాయి వృద్ధిరేటుతోను పోల్చి చూస్తే ఈ సంవత్సరం ఆర్థిక వ్యవస్థ అత్యధిక వృద్ధిరేటు సాధించింది. ఈ అధిక వృద్ధిరేటుకు వ్యవసాయ, పారిశ్రామిక, సేవల రంగాలు మూడూ కూడా అధిక వృద్ధిని సాధించి తమ వంతు సహకారం అందించాయి. సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని పెంపొందించాలనే మా లక్ష్యంలో భాగంగా, సబ్సిడీ

బియ్యం పథకం, రైతులకు ఉచిత విద్యుత్, సబ్సిడీతో కూడిన వడ్డీ పథకాలు, ఆరోగ్యశ్రీ పథకం క్రింద ఆరోగ్య సంరక్షణ నెట్ వర్కును నిరుపేదలందరికీ విస్తరింప చేయడం వంటి వాటిని అమలు చేయడంతోపాటుగా, సాగునీరు, గృహ నిర్మాణం, పింఛన్లు, బి.సి., ఎస్.సి., ఎస్.టి లకు స్కాలర్‌షిప్పుల కోసం రాష్ట్ర ప్రణాళిక వ్యయాన్ని గణనీయంగా పెంచాలనే ప్రస్తుత వ్యూహాన్ని కొనసాగిస్తాం.

## ఆర్థికాభివృద్ధి

5. ముందస్తు అంచనాల ప్రకారం (1999-2000) స్థిర ధరల వద్ద రాష్ట్ర స్థూల వార్షికోత్పత్తి 2007-08 సంవత్సరంలో 2,29,461 కోట్ల రూపాయలుగా అంచనా వేయడమైనది. ఇది గత సంవత్సరంలో త్వరిత అంచనాలపై 10.37 శాతం అధికంగా ఉంది. 1999-2000 స్థిర ధరల వద్ద, వ్యవసాయ రంగం వృద్ధిరేటు జాతీయ స్థాయిలో 2.59 శాతం ఉండగా, రాష్ట్రం 8.38 శాతం వృద్ధిని సాధించింది. ప్రస్తుత సంవత్సరంలో పారిశ్రామిక రంగం 9.88 శాతం, సేవల రంగం 11.57 శాతం వృద్ధిని సాధించాయి. కాగా, పారిశ్రామిక రంగంలో జాతీయస్థాయి వృద్ధిరేటు 8.90 శాతంగాను, సేవల రంగంలో 10.73 శాతంగాను ఉంది.

6. రాష్ట్ర తలసరి ఆదాయం ప్రస్తుత ధరల వద్ద 2007-08 సంవత్సరంలో 33,970 రూపాయలుగా అంచనా వేయడమైనది. 2006-07 సంవత్సరంలోని త్వరిత అంచనాల ప్రకారం తలసరిఆదాయం 29,582 రూపాయలపై ఇది 14.83 శాతం పెరుగుదలను సూచిస్తున్నది. 1999-2000 స్థిర ధరల వద్ద తలసరి ఆదాయం 2007-08 సంవత్సరంలో 9.35 శాతం పెరిగి 24,969 రూపాయలకు చేరింది. ఇది 2006-07 సంవత్సరంలో 22,835 రూపాయలుగా ఉంది. 2007-08 సంవత్సరం తలసరి ఆదాయంలో జాతీయస్థాయి వృద్ధి రేటు 7.55 శాతంగా ఉంది.

## ఆర్థిక వనరుల నిర్వహణ

7. ఆర్థిక వనరుల నిర్వహణలో ఆర్థిక పరమయిన క్రమశిక్షణను పెంపొందించడం కోసం ఉద్దేశించిన ద్రవ్యబాధ్యత, బడ్జెట్‌నిర్వహణ చట్టం (ఎఫ్.ఆర్.బి.ఎమ్.)ను సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉంది. ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం ప్రకారం, 2008-09 నాటికి రెవెన్యూ లోటును శూన్య స్థాయికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకోగా, ప్రభుత్వం, ఈ లక్ష్యాన్ని రెండు సంవత్సరాల ముందుగానే 2006-07 నాటికి రెవెన్యూ లోటును పూడ్చి మిగులు సాధించింది. పింఛన్‌లు, స్కాలర్ షిప్పులు, బియ్యం సబ్సిడీ, విద్యుత్ సబ్సిడీ వంటి వాటికి రెవిన్యూ వ్యయాన్ని భారీగా పెంచినప్పటికీ, రెవిన్యూ మిగులును సాధించడం ఆర్థిక వనరుల నిర్వహణలో ప్రభుత్వ నైపుణ్యానికి, క్రమశిక్షణకు నిదర్శనం.

8. ద్రవ్యలోటును ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం ప్రకారం, 2008-09 నాటికి రాష్ట్ర వార్షికోత్పత్తిలో 3 శాతానికి, మొత్తం రుణాలను రాష్ట్ర వార్షికోత్పత్తిలో 35 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఈ లక్ష్యాలను కూడా ప్రభుత్వం 2 సంవత్సరాలు ముందుగానే సాధించింది. 2003-04లో ద్రవ్యలోటు జి.ఎస్.డి.పి. లో 4.04 శాతం ఉండగా, 2006-07 సంవత్సరానికి దానిని 2.13 శాతానికి తగ్గించాము. మొత్తం రుణం ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టం ప్రకారం గరిష్ట పరిమితి 35 శాతానికిగాను 2006-07 సంవత్సరం నాటికి జి.ఎస్.డి.పి.లో 28.54 శాతంగా ఉంది.

9. రెవిన్యూ లోటు, ద్రవ్య లోటు విషయమై ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్టంలో సూచించిన లక్ష్యాలను సాధించడంద్వారా, రాష్ట్ర ప్రభుత్వం రెండురకాల ప్రయోజనాలను పొందుతున్నది. అవేవంటే కేంద్ర ప్రభుత్వం నుండి రుణ మాఫీ, వడ్డీ మాఫీ సదుపాయం క్రింద ఆర్థిక సహాయం పొందడం. ఈ లక్ష్యం క్రింద 2007-08 సంవత్సరం వరకు, రుణ మాఫీ క్రింద 1,889 కోట్ల రూపాయలు, వడ్డీ

మాఫీ క్రింద 1,574 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం పొందింది. 2003-04 సంవత్సరంలో రెవిన్యూ వ్యయంలో వడ్డీ భారం 22.98 శాతం కాగా, 2006-07 సంవత్సరం నాటికి వడ్డీ భారం 17.57 శాతానికి తగ్గించాము.

10. 2003-04 సంవత్సరంలో మూలధన వ్యయం 4,251 కోట్ల రూపాయలు కాగా, 2006-07 సంవత్సరంలో మూలధన వ్యయం 9,904 కోట్ల రూపాయలకు పెరిగింది. 2003-04 సంవత్సరంలో ప్రభుత్వ రుణం 8,687 కోట్ల రూపాయలు కాగా 2006-07 సంవత్సరంలో గణనీయంగా 5,013 కోట్ల రూపాయలకు తగ్గింది. 2003-04 సంవత్సరంలో ప్రభుత్వ నికర రుణంలో మూల ధన వ్యయం 49 శాతం కాగా 2006-07 సంవత్సరం నాటికి 198 శాతానికి పెరిగింది. ప్రభుత్వం రుణాన్ని సాధారణ పరిపాలన ఖర్చుల కోసం కాకుండా, ఉత్పత్తిని పెంచడానికి దోహదపడే ఆస్థులు సృష్టించడానికి మాత్రమే వినియోగిస్తున్నా మనడానికిదే నిదర్శనం.

11. సిబ్బంది నియామకం, శిక్షణను మెరుగుపరచడం, ఇతర సౌకర్యాలను సమకూర్చడం ద్వారా అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం వంటి చర్యలద్వారా రెవెన్యూ వసూళ్ల శాఖల సామర్ధ్యాన్ని పెంపొందించి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకునేందుకు నిరంతరం కృషి చేస్తున్నాము. వాణిజ్య పన్నులశాఖ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు శాఖలలో కంప్యూటరీకరణ కార్యక్రమాలతో వీటిని బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్కు ద్వారా అనుసంధానం చేస్తున్నాము. వాణిజ్య పన్నుల శాఖ లోని చెక్‌పోస్టులను ఆధునీకరించి, అక్కడ సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, వాహన రాకపోకలపై నిఘా పెంచడం జరిగింది.

12. 2006-07లో, మొత్తం రాష్ట్ర పన్ను ఆదాయం 23,926 కోట్ల రూపాయలు. ఇది అంతకు మునుపటి సంవత్సరం కన్నా 22 శాతం అధికం. 2004-05 సంవత్సరం నుంచి పన్ను ఆదాయం సగటున 20.13 శాతం వృద్ధి చెందింది. ప్రస్తుత

సంవత్సరంలో మూడవ త్రైమాసిక కాలం పూర్తయ్యేనాటికి, పన్ను ఆదాయం గత సంవత్సరం మీద 19 శాతం వృద్ధిని సాధించడం జరిగింది. ఈ సంవత్సరం పన్ను వసూళ్లు, ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్న తీరునుబట్టి, బడ్జెటు లక్ష్యాల మేరకు రెవిన్యూ వసూళ్లు సాధించగలమని ఆశిస్తున్నాము. ప్రస్తుత సంవత్సరం బడ్జెట్ అంచనాల మీద 20.6 శాతం వృద్ధితో, 2008-09 సంవత్సరానికి 37,866 కోట్ల రూపాయల రెవెన్యూ వసూళ్లను లక్ష్యంగా నిర్ణయించాము.

13. కేంద్ర ప్రభుత్వం నుంచి 2008-09 సంవత్సరంలో ప్రణాళికేతర గ్రాంటుగా 1,155 కోట్ల రూపాయలు లభిస్తుందని ఆశిస్తున్నాము. ఇందులో అధిక భాగం 12వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం లభించే నిర్వహణ గ్రాంట్లు. ప్రణాళికా గ్రాంటు క్రింద 5,115 కోట్ల రూపాయలు లభిస్తుందని అంచనా వేశాము. ఇందులో ముఖ్యమైనవి, సత్వర సాగునీటి ప్రయోజన కార్యక్రమం (ఎఐబిపి) క్రింద విడుదల చేసే 2,000 కోట్ల రూపాయలు, జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్ (జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎమ్.) క్రింద విడుదల చేసే 1,250 కోట్ల రూపాయలు, రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన (ఆర్.కె.వి.వై.) క్రింద విడుదల చేసే 439 కోట్ల రూపాయలు. ఇవి కాకుండా, కేంద్ర ప్రతిపాదిత పథకాల క్రింద 5,320 కోట్ల రూపాయలు విడుదల అవుతుందని ఆశిస్తున్నాము. 2008-09 సంవత్సరంలో కేంద్ర పన్ను వసూళ్లలో రాష్ట్ర వాటాగా 12,597 కోట్ల రూపాయలు లభిస్తుందని ఆశిస్తున్నాము.

## ప్రణాళికా కేటాయింపులు

14. గత రెండు సంవత్సరాలలో అనగా 2006-07, 2007-08 సంవత్సరాలలో దేశంలో అత్యధిక వార్షికప్రణాళిక గల రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే అని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. 2008-09 సంవత్సరంలో రాష్ట్రవార్షిక

ప్రణాళికను 43,203 కోట్ల రూపాయలుగా నిర్ణయించాము. ఇది గత సంవత్సరం ప్రణాళిక కంటే 13,185 కోట్ల రూపాయలు అధికం. 2003-04 సంవత్సరంలో మొత్తం వ్యయంలో ప్రణాళికా వ్యయం కేవలం 24 శాతం మాత్రమే. ఇది 2006-07 సంవత్సరం నాటికి 32 శాతానికి పెరిగింది. 2008-09 సంవత్సరం మొత్తం బడ్జెట్ వ్యయంలో 43 శాతాన్ని ప్రణాళిక రంగానికి కేటాయించాము.

15. మా ప్రభుత్వ ప్రాధాన్యత ప్రకారం, సహజంగానే సాగునీటి ప్రాజెక్టులు కేటాయింపులో మొదటి స్థానాన్ని, ఇందిరమ్మ ఇళ్లు రెండో స్థానాన్ని పొందాయి. 2008-09 సంవత్సరంలో సాగునీటి ప్రాజెక్టులకు 16,500 కోట్ల రూపాయలు, ఇందిరమ్మ గృహ నిర్మాణానికి 5,850 కోట్ల రూపాయలు కేటాయించాము. 11వ పంచవర్ష ప్రణాళికా ప్రాధాన్యతలకు అనుగుణంగా, విద్య, వైద్యరంగాలకు కేటాయింపులు భారీగా పెంచాము. 2008-09 బడ్జెట్‌లో విద్యకు 1,771 కోట్ల రూపాయలు కేటాయించాము. ఇది ప్రస్తుత సంవత్సర కేటాయింపుకు 115 శాతం అదనం. అలాగే, వైద్య ఆరోగ్య రంగానికి ప్రస్తుత సంవత్సరం కేటాయింపుకు 73 శాతం అదనంగా 1,315 కోట్ల రూపాయలు కేటాయించాము. 2008-09 బడ్జెట్‌లో, వ్యవసాయ రంగానికి గత సంవత్సరం కేటాయింపుల మీద 257 శాతం అధికంగా 1,666 కోట్ల రూపాయలు కేటాయించాము. మొత్తం వ్యవసాయం మరియు అనుబంధ రంగాలకు కలిపి 144 శాతం అధికంగా 2,723 కోట్ల రూపాయలు కేటాయించాము. పారిశ్రామిక రంగానికి ప్రస్తుత సంవత్సరం కేటాయింపుల కంటే 25 శాతం అధికంగా 530 కోట్ల రూపాయలు కేటాయించాము. మౌలిక సౌకర్యాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నాము. మౌలిక సౌకర్యాల అభివృద్ధికి 73 శాతం అధికంగా 2,277 కోట్ల రూపాయలు కేటాయించాము.

16. మా ప్రభుత్వం సంక్షేమ రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నది. సంక్షేమ రంగాలకు ప్రస్తుత సంవత్సరం కేటాయింపుల మీద 55 శాతం అధికంగా

నిధులు కేటాయించాము. సాంఘిక సంక్షేమానికి ప్రణాళికలో 2007-08 సంవత్సరంలో 826 కోట్ల రూపాయలు కేటాయించగా, 2008-09 సంవత్సరంలో 1,293 కోట్ల రూపాయలకు పెంచాము. అలాగే, గిరిజన సంక్షేమానికి 317 కోట్ల రూపాయల నుంచి 2008-09 సంవత్సరంలో 440 కోట్ల రూపాయలకు పెంచాము. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి కేటాయింపులు 2007-08 సంవత్సరంలో 199 కోట్ల రూపాయలు కాగా, 2008-09 సంవత్సరంలో 353 కోట్ల రూపాయలకు పెంచాము. అలాగే, అల్ప సంఖ్యాక వర్గాలకు కేటాయింపులు 2007-08 సంవత్సరంలో 120 కోట్ల రూపాయల నుంచి 2008-09 సంవత్సరంలో 177 కోట్ల రూపాయలకు పెంచాము.

17. ప్రభుత్వం, ఈ బడ్జెట్‌లో గ్రామీణ, పట్టణాభివృద్ధి రంగాలకు సమ ప్రాధాన్యత ఇస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని ప్రజల పెరుగుతున్న అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, ఈ రెండు శాఖలకు కేటాయింపులు భారీగా పెంచాము. 2008-09 బడ్జెట్‌లో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధికి గత బడ్జెట్ కేటాయింపుల కన్నా 68 శాతం అధికంగా 3,838 కోట్ల రూపాయలు, మున్సిపలు పరిపాలనకు 70 శాతం అధికంగా 3,136 కోట్ల రూపాయలు కేటాయించాము.

## వ్యవసాయ రంగం

18. వ్యవసాయ ఉత్పత్తి మరియు ఉత్పాదకత రంగాలలో ఆంధ్రప్రదేశ్ సమున్నత స్థానానికి చేరుకుంటోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 2003-04 సంవత్సరంలో 6వ స్థానంలో ఉన్న రాష్ట్రం, 2004-05 సంవత్సరంలో 4వ స్థానానికి, 2005-06 సంవత్సరంలో 3 వ స్థానానికి చేరుకుంది. ప్రస్తుత సంవత్సరం మరో రికార్డు సంవత్సరం కానుంది. ముందస్తు అంచనాల

ప్రకారం, ప్రస్తుత సంవత్సరంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 180 లక్షల మెట్రిక్ టన్నులు. ఇప్పటివరకు ఇదే అత్యధిక ఉత్పత్తి. నూనెగింజల ఉత్పత్తి గత సంవత్సరంకన్నా 61.80 శాతం అధికంగా 29 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అవుతుందని అంచనా. పంట ఉత్పాదకతననుసరించి ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి, మొక్కజొన్న, వేరుశెనగ పంటలు అత్యధిక ఉత్పాదకతను సాధించి రికార్డు సృష్టించాయి.

19. వ్యవసాయ రంగంలో పెట్టుబడిని, తద్వారా ఉత్పత్తిని పెంచి వ్యవసాయ రంగంలో 4 శాతం వృద్ధిని సాధించాలంటే రైతులకు తగినంత రుణ సదుపాయం కల్పించడం ముఖ్యం. పావలా వడ్డీ పథకంలో భాగంగా రైతులు తీసుకున్న పంట రుణాలను ఏడాదికి 3 శాతం వడ్డీకి సమకూర్చాలని ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. ఆ విధంగా, 2008-09 సంవత్సరానికి ఈ పద్దు కింద 310 కోట్ల రూపాయలను కేటాయించాము.

20. వ్యవసాయం మరియు వ్యవసాయానుబంధ రంగాలలో 4 శాతం వృద్ధిని సాధించడం కోసం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వ అదనపు సహాయంతో అమలు చేస్తున్నాము. ఈ పథకం రాష్ట్ర వ్యవసాయ ప్రణాళికలలో వివిధ ప్రాంతాలకు, పంటలకు తగు ప్రాముఖ్యత లభించేలా కృషి చేస్తుంది. బడ్జెట్‌లో ఈ పథకం కోసం 400 కోట్ల రూపాయలు కేటాయించాము.

21. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పశు సంపద కూడా చాలా ముఖ్యమైన జీవనాధారం. ఈ పశుసంపద ఉత్పత్తి సామర్ధ్యాన్ని పెంపొందించి, దీనిపై ఆధారపడిన వారి ఆదాయ స్థాయిని పెంపొందించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వం కడప జిల్లా, పులివెందులలో ఒక ప్రపంచ స్థాయి సంస్థ **సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ రీసెర్చి**

**ఫర్ లైవ్ స్టాక్** ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం 644 ఎకరాల స్థలాన్ని కూడా సేకరించాము. 2008-09 సంవత్సరపు బడ్జెట్‌లో ఇందుకోసం 100 కోట్ల రూపాయలు కేటాయించాము.

22. వ్యవసాయానుబంధ రంగాలలోని పశు సంవర్ధన, మత్స్య, పాడిపరిశ్రమాభివృద్ధి రంగాలలో ఉపాధి, ఉత్పాదకత పెంపొందించడం కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక ప్యాకేజి క్రింద వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాము. ఇందులో ముఖ్యమైనది పశుక్రాంతి పథకం. ఈ పథకం క్రింద 50 శాతం సబ్సిడీతో గ్రామీణ పేద కుటుంబాలకు మేలు జాతి గేదెలు, ఆవులను పంపిణీ చేయడం జరుగుతుంది. మిగిలిన 50 శాతం కూడా బ్యాంకులు రుణాలు అందించేలా ఏర్పాట్లు చేస్తాం. ఈ పశువులకు మేతను కూడా 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేయడం జరుగుతుంది. ఈ పథకం క్రింద రాబోవు సంవత్సరంలో లక్ష పాడి పశువులను పంపిణీ చేయాలని నిర్ణయించాము. ఇందుకోసం 2008-09 బడ్జెట్లో 200 కోట్ల రూపాయలు కేటాయించాము.

23. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనువైన రాష్ట్రం. వ్యవసాయమంత్రి ఆధ్వర్యంలో ఒక అధికార్ల బృందం పశ్చిమ బెంగాల్, కేంద్ర ప్రభుత్వాల ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు సంబంధించి అమలవుతున్న పథకాల తీరుతెన్నులను పరిశీలించడానికి కలకత్తా, న్యూఢిల్లీలను సందర్శించింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు వ్యవసాయ మార్కెటింగ్‌కు అదనంగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలపై ప్రత్యేక శ్రద్ధను సారించడానికి వీలుగా, ప్రస్తుతమున్న వ్యవసాయ మార్కెటింగ్ శాఖను, ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయం తత్సంబంధిత రంగాల మార్కెటింగ్ శాఖగా మార్చాలని నిర్ణయించడమైంది.

## జలయజ్ఞం

24. మాప్రభుత్వం 2007 డిసెంబర్ నాటికి అధిక విస్తీర్ణంలోని ఆయకట్టును స్థిరీకరించడంతోపాటు 14.25 లక్షల ఎకరాలు కొత్త ఆయకట్టుకు నీరందించిందని తెలియజేయడానికి చాలా సంతోషిస్తున్నాను. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మార్చగల ఇంత పెద్ద కార్యక్రమం చేపట్టిన ప్రభుత్వం గతంలో లేదు. ఈ సందర్భంగా నేనొక మాట చెప్పదలచాను;

> **సిద్ధాంతం కోసం అపహాస్యాన్ని, అవమానాలను ఎదుర్కొని, విజయం సాధించి, దానిని ఆస్వాదించే వారి సరసన నా పేరు నిలవనీయండి.**
>
> **-- లూయిసా మే ఆల్కాట్**

చాలామంది సాగునీటి ప్రాజెక్టులు ఎప్పటికీ పూర్తికావని అనుమానాలు వ్యక్తం చేశారు. అవన్నీ అవాస్తవాలని తేలి పోయినందుకు సంతోషంగా ఉంది. రాష్ట్రంలో సృష్టించబడిన కొత్త ఆయకట్టు ఇప్పటికే రాష్ట్రం గతమెన్నడూ లేనంత ఎక్కువ ఆహారధాన్యాల ఉత్పత్తి సాధించడానికి తోడ్పడింది. సాగునీటి ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేయడానికి మేము నిబద్ధతతో కృషి చేస్తున్నాము.

25. 2009 మార్చి నాటికి 27 ప్రాజెక్టులు పూర్తి చేసి, మరో 16.18 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడంతో పాటు, 16.66 లక్షల ఎకరాలు ఆయకట్టు స్థిరీకరించాలనే కృతనిశ్చయంతో పనులు చేస్తున్నాము. దీంతో రాష్ట్రం మొత్తం 30.43 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడమవుతుంది.

26. సంవత్సరం సంవత్సరానికి సాగునీటి రంగానికి కేటాయింపులు పెంచుతూ వస్తున్నాము. ప్రస్తుతం 2008-09 సంవత్సరానికి సాగునీటి రంగానికి 16,500 కోట్ల

రూపాయలు కేటాయించాము. ప్రభుత్వం ఈ సంవత్సరం అదనంగా మరో భారీ ప్రాజెక్టు అయిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టింది. గోదావరి నుంచి 160 టి.ఎం.సిల నీటిని మళ్లించి, అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలలోని 12.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి ఈ భారీ ప్రాజెక్టును చేపట్టాం. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 17,875 కోట్ల రూపాయల వ్యయం కాగలదని అంచనా వేశాం.

27. **ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగం అభివృద్ధి ప్రాజెక్టు** క్రింద 4,444 కోట్ల రూపాయల ప్రపంచ బ్యాంకు సహాయంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఆధునీకరణ పనులు చేపట్టాం. దీనివలన, సాగునీటి నిర్వహణను అభివృద్ధి పరచి, నీటి వృధాని తగ్గించి ఆహార ఉత్పత్తిని మెరుగుపరచడానికి 4.03 లక్షల ఎకరాలకు మెరుగైన సాగునీరు వసతులు అందించేలా పనులు జరుగుతున్నాయి. ఈ పనులు 5 ఏళ్ల కాలంలో పూర్తవుతాయి.

28. **ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ బేస్డ్ ట్యాంక్ మేనేజిమెంటు ప్రాజెక్టు** క్రింద రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 3,000 చిన్న తరహా సాగునీటి చెరువులను ఆధునీకరించే పనులు చేపట్టాం. వీటిని 1,044 కోట్ల రూపాయల వ్యయంతో మూడు దశలుగా ఐదు సంవత్సరాల కాలంలో పూర్తి చేస్తాము. దీనివలన 6.25 లక్షల ఎకరాలకు మెరుగైన సాగునీటి వసతులు కల్పించడం జరుగుతుంది. ఈ ప్రాజెక్టుకు ప్రపంచ బ్యాంకు, కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తాయి.

## పారిశ్రామిక రంగం

29. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, దేశంలోనే పారిశ్రామిక రాష్ట్రాలలో అగ్రగామిగా తీర్చి దిద్దడానికి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. 2007, ఆగస్టులో రిజర్వు బ్యాంక్ ఆఫ్

ఇండియా నివేదిక ప్రకారం 2006-07 సంవత్సరంలో 25,173 కోట్ల రూపాయల పెట్టుబడులతో గుజరాత్ తర్వాత అత్యధిక పెట్టుబడులను ఆకర్షించిన రెండో రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలచింది. అదే విధంగా, 2007, మార్చిలో భారత పరిశ్రమల సమాఖ్య (సి.ఐ.ఐ) సర్వే కూడా దక్షిణాది రాష్ట్రాలలో పారిశ్రామిక ఉత్పత్తి రంగంలో ఆంధ్రప్రదేశ్ ఉత్తమ పనితీరు సాధించిన రాష్ట్రంగా పేర్కొంది.

30. ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు రెండంకెలకు చేరుతున్న ప్రస్తుత తరుణంలో, పారిశ్రామికోత్పత్తి రంగం వృద్ధి రేటు కూడా 2004-05 సంవత్సరంలోని 6.09 శాతం నుంచి 2006-07 సంవత్సరం నాటికి 10.20 శాతానికి చేరుకుంది. పారిశ్రామిక పెట్టుబడుల విధానం 2005-2010 యొక్క అతి ముఖ్య ఉద్దేశ్యం, పారిశ్రామికీకరణ ద్వారా ఉపాధిని పెంచడం. గత మూడున్నర సంవత్సరాలలో 12,350 కోట్ల రూపాయల విలువైన పెట్టుబడులు పారిశ్రామికోత్పత్తి రంగంలో స్థాపితమయి 1,72,616 మందికి ఉపాధి చూపించాయి. వచ్చే రెండు, మూడు సంవత్సరాలలో 38,671 కోట్ల రూపాయల పెట్టుబడుల ద్వారా 1,30,458 మందికి ఉపాధి లభిస్తుందని ఆశిస్తున్నాము. రాష్ట్రంలో ఎక్కువ అవకాశాలు గల సిమెంటు, స్టీలు, పేపర్, ముడి ఔషధాలు, చేనేత, ఫార్మాసూటికల్స్ వంటి రంగాలు వచ్చే రెండు సంవత్సరాలలో రెట్టింపు ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధిస్తాయి. బహుళ జాతి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో తమ యూనిట్లు స్థాపించడానికి ఆసక్తి కనపరుస్తున్నాయి.

31. ఓషధపరిశ్రమ, చేనేతపరిశ్రమ, తోలుపరిశ్రమ, వజ్రాలు మరియు ఆభరణాలు మొదలు వివిధ రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షించడం కోసం రాష్ట్రం అనేక ప్రత్యేక ఆర్థిక మండళ్లను అభివృద్ధి పరుస్తున్నది. రాష్ట్రంలో 71 ప్రత్యేక ఆర్థిక మండళ్లు ఏర్పాటు కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 49 ఆర్థిక మండళ్లను ప్రకటించింది. దేశంలో ఇన్ని ప్రత్యేక ఆర్థిక మండళ్లను పొందిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. వీటి ద్వారా 35 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రంలోకి

వస్తాయి. ఈ ప్రత్యేక ఆర్థిక మండళ్ల వలన దాదాపు 25 లక్షల మందికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

32. ఏడు సహకార చక్కెర కర్మాగారాల సామర్థ్యాన్ని పెంపొందించడం కోసం జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్.సి.డి.సి.) అందించే రుణాలకు ప్రభుత్వం గ్యారంటీని సమకూరుస్తున్నది. ఈ రుణాలతో సహకార చక్కెర కర్మాగారాలు ఆధునికీకరణతో స్వయంశక్తిని సంతరించుకొని ఉత్పత్తిని పెంచుతాయని ఆశిస్తున్నాము.

## సేవల రంగం

33. రికార్డు స్థాయిలో సాఫ్ట్‌వేర్ ఎగుమతులు సాధిస్తూ, యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందిస్తూ ఇన్ఫర్మేషను టెక్నాలజీ రంగం ప్రశస్తమైన రీతిలో వృద్ధి చెందుతోంది. బహుళ జాతి కంపెనీలను ఆకర్షించడంతోపాటు దేశీయ కంపెనీలను రాష్ట్రంలో తమ యూనిట్లు స్థాపించేందుకోసం తమ కార్యకలాపాలను విస్తరించేలా ప్రోత్సహించడం ప్రభుత్వం అనుసరిస్తున్న ఐటి ప్రోత్సాహక విధానం. రాష్ట్రం మొత్తం ఎగుమతులలో ఐ.టి. రంగం ఎగుమతులు 52 శాతంగా ఉన్నాయి. గత మూడు సంవత్సరాల కాలంలోని ప్రతి సంవత్సరం ఎగుమతులలో 40 శాతం పైబడిన రేటుతో అభివృద్ధి చెందుతున్నాయి.

34. కేంద్ర ప్రభుత్వం 40 ఐటి ప్రత్యేక ఆర్థిక మండళ్లను ఆమోదించింది. ఇవి అంతర్జాతీయ ప్రమాణాలు గల ఐ.టి. కార్యాలయ వాతావరణాన్ని కలిగిస్తాయి. ఇవి దేశంలోనే అత్యధికం. ఈ ఆర్థిక మండలుల వలన రాబోవు 5 సంవత్సరాలలో మరో 8 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇవే కాకుండా, ప్రైవేటు

పెట్టుబడిదారులు మరో 15 ప్రైవేటు ఐటి పార్కులను అభివృద్ధి చేస్తున్నారు. వాటి వలన రానున్న కాలంలో మరో లక్షా 49 వేల మందికి ఉపాధి కలుగుతుంది.

35. ప్రభుత్వ సేవలను/ప్రయోజనాలను గ్రామీణ ప్రజల దగ్గరికి చేర్చడం కోసం ఉద్దేశించిన రాజీవ్ ఇంటర్నెట్ విలేజ్ కార్యక్రమం పురోగతి సాధిస్తూ ప్రస్తుతం 513 కేంద్రాలలో అమలు అవుతున్నది.

36. సమాచార సాంకేతిక శాఖకు ప్రణాళిక కేటాయింపులు ప్రస్తుత సంవత్సరంలోని 85 కోట్ల రూపాయల నుంచి 2008-09 సంవత్సరంలో 397 కోట్ల రూపాయలకు పెంచాము.

## మౌలిక సౌకర్యాలు

37. ఆర్థికాభివృద్ధికి కీలకమైన మౌలిక సౌకర్యాల స్థాయిని పెంపొందించడం కోసం ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తోంది. మౌలిక వసతుల అభివృద్ధికి అధిక మొత్తంలో పెట్టుబడులు అవసరం కావడంతో, ప్రైవేటు పెట్టుబడిదారులను ఈ రంగంలోకి ఆకర్షించి, భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణం మరియు నిర్వహణలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టాలని నిర్ణయించాము. విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, మెట్రో రైలు వంటి ప్రాజెక్టులను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపడుతున్నాము.

## రోడ్లు

38. ప్రస్తుత సంవత్సరంలో 943 కోట్ల రూపాయలు రహదారులు, భవనాల శాఖకు, 328 కోట్ల రూపాయలు పంచాయతీరాజ్ శాఖకు నూతన రహదారుల

నిర్మాణం, రహదారుల వెడల్పు పెంచడం వంటి కార్యక్రమాల కోసం కేటాయించడమైనది. ఈ కేటాయింపులను 2008-09 సంవత్సరానికి రహదారుల, భవనాల శాఖకు 1,445 కోట్ల రూపాయలు, పంచాయతీరాజ్ శాఖకు 549 కోట్ల రూపాయలకు పెంచాము.

## విమానాశ్రయాలు

39. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం 2008 మార్చి 16వ తేదీన ప్రారంభం అవుతుందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. విశాఖపట్నంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పరచడం కోసం స్థలాన్ని ఎంపిక చేయడం జరిగింది. రాజమండ్రి, విజయవాడ, వరంగల్, కడప విమానాశ్రయాల స్థాయిని పెంచడం కోసం ఎయిర్‌పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియాతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. 2008-09 బడ్జెట్‌లో ఈ విమానాశ్రయాల అభివృద్ధికి 60 కోట్ల రూపాయలు కేటాయించాం. వీటిని కూడా ప్రభుత్వ – ప్రైవేటు భాగస్వామ్యంలో చేపట్టాలని ప్రతిపాదించడమైనది.

40. రాష్ట్రంలో విమానయాన సేవల అభివృద్ధి కోసం 55 కోట్ల రూపాయల నిధులతో ప్రభుత్వ రంగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ కార్పొరేషన్ పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేయడమైనది.

## ఓడరేవులు

41. కోస్తాప్రాంతంలోని అన్ని జిల్లాల్లో ఓడరేవులను అభివృద్ధిపరచడానికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కార్గో నిర్వహణలో దేశంలోనే రెండవ స్థానంలో ఉంది. విశాఖపట్నం దగ్గర

నిర్మిస్తున్న గంగవరం పోర్టు ఈ సంవత్సరం కార్యకలాపాలను ప్రారంభిస్తుందని ఆశిస్తున్నాం. ఈ పోర్టు 35 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యాన్ని నిర్వహించగలదని అంచనా వేయడమయింది. అలాగే, కృష్ణపట్నం పోర్టు కూడా 2008, జూలై నాటికి కార్యకలాపాలను ప్రారంభించేలా చర్యలను తీసుకోవడ మవుతున్నది. 2008-09 సంవత్సర బడ్జెట్ అంచనాలలో ఓడరేవుల అభివృద్ధికోసం 65.24 కోట్ల రూపాయలు కేటాయించాం.

## విద్యుత్ రంగం

42. ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తున్నకొద్దీ విద్యుత్ డిమాండు కూడా అధికమవుతుంది. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడానికై 11వ ప్రణాళికలో విద్యుత్ రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలో ప్రస్తుత విద్యుత్ ఉత్పత్తి సంస్థల ఉత్పాదక సామర్థ్యం 12,339 మెగావాట్లు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాల్సిన ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వం 8,945 మెగావాట్ల ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచే లక్ష్యాన్ని ప్రభుత్వ రంగంలోని జెన్‌కోకు అప్పగించింది. ఇందులో 7,109 మెగావాట్లకు సంబంధించిన కార్యక్రమాలను 11వ ప్రణాళిక కాలంలో చేపట్టడం జరుగుతుంది.

43. గత సంవత్సరంలో 19.82 శాతంగా ఉన్న విద్యుత్ సరఫరా పంపిణీ నష్టాలను, 2007-08 సంవత్సరంలో 18.51 శాతానికి తగ్గించడానికి కృషి చేస్తున్నాము. ఈ సంవత్సరంలో రాజీవ్ గ్రామీణ విద్యుద్దీకరణ యోజన క్రింద 3,204 జనావాసాలకు 8,00,452 గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాము.

44. పారిశ్రామిక రంగానికి విద్యుత్ ఛార్జీలు 2005-06 సంవత్సరంలో యూనిట్‌కు 3 రూపాయల 70 పైసలు ఉండగా, 2007-08లో యూనిట్‌కు 3

రూపాయల 56 పైసలకు తగ్గించాము. తగినంత గ్యాస్ సరఫరా లేకపోవడం వల్ల విద్యుత్ ఉత్పత్తిలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ 2007 ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ రంగానికి సంతృప్తి స్థాయిలో విద్యుత్ అందించాము. 2008-09 బడ్జెట్‌లో విద్యుత్ వినియోగ సంస్థలకు సబ్సిడీగా 2,385 కోట్ల రూపాయలను సమకూర్చాం.

## సంక్షేమం

**రాజకీయాలు అంటే పెద్ద ఎత్తున డబ్బు లేదా అధికారం కోసం ప్రాకులాడడం కాదు. ఇది ప్రజల జీవితాలను మెరుగుపర్చడానికి సంబంధించినది.**

**-- పాల్ వెల్‌స్టోన్**

45. సమగ్ర పురోభివృద్ధి అంటే మెరుగైన సంక్షేమం, జీవన ప్రమాణాలను సమకూర్చడం. ఇందుకు మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. సంక్షేమ మంటే ఆకలితో అలమటించే ప్రతి అన్నార్తి కడుపు నింపడం. సంక్షేమ మంటే నిలువ నీడ లేని కుటుంబాలన్నింటికి గృహ వసతి కల్పించడం. సంక్షేమ మంటే పని లేక దారిద్ర్యం అనుభవించే నిర్భాగ్యులందరికీ ఉపాధి కల్పించడం. సంక్షేమ మంటే ప్రతి పిల్లవాడు విద్యాబుద్ధులు నేర్చుకునే వాతావరణం సృష్టించడం. పేద, పెద్ద తేడా లేకుండా అందరికి నాణ్యమైన వైద్య సేవలందించి ఆరోగ్యమైన జీవన అవకాశం కల్పించడం అని అర్థం. పైన పేర్కొన్న సేవలన్నింటినీ ఎంతటి విస్తృత స్థాయిలో అమలు పరుస్తున్నామో గౌరవ సభ్యులందరికి తెలుసు.

## ఆహార భద్రత

46. **ఆరోగ్యకరమైన శరీరం మంచి జ్ఞానాన్ని కల్గి ఉంటుంది** అన్నది సామెత. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి, ప్రతి వ్యక్తికి ఆహార భద్రతను కల్పించడం కోసం ప్రభుత్వం కిలో బియ్యం రెండు రూపాయలకే అందించాలన్న నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం 2008-09 సంవత్సరంలో బియ్యం సబ్సిడీని 1,980 కోట్ల రూపాయలకు పెంచుతూ ఈ వాగ్దానాన్ని నెరవేరుస్తుంది. ఈ పథకం రాష్ట్రంలో 80 శాతం ప్రజలకు లబ్దిని చేకూర్చుతుంది. దీనికి అదనంగా, వరదలు, అనావృష్టివంటి ప్రకృతి వైపరీత్యాల కాలంలో పేదలకు అరువుపై ఆహార ధాన్యాలు అందించడం కోసం గ్రామీణ గ్రెయిన్ బ్యాంకులు ఏర్పాటు చేశాం. ఈ పథకాన్ని 1.81 లక్షల కుటుంబాలు వినియోగించుకొంటున్నాయి. రైతు బజార్లు సక్రమంగా పని చేసేలా చూడడం, అవసరమయిన చోట మార్కెట్ జోక్యం పథకాలను అమలు పర్చడం అనేవి ధరల పెరుగుదలను నియంత్రించడానికి ప్రభుత్వం తీసుకున్న కొన్ని చర్యలు. 2008-09 సంవత్సరానికి మార్కెట్ జోక్యం పథకం కోసం 30 కోట్ల రూపాయలను సమకూర్చాము.

47. గర్భిణీ స్త్రీలకు, చిన్న పిల్లలకు పోషకాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్యను మా ప్రభుత్వం పెంచింది. ఈ సంవత్సరంలో కొత్తగా 6,470 అంగన్ వాడీ కేంద్రాలను నెలకొల్పడమయింది. మొత్తం 73,944 కేంద్రాల ద్వారా రాష్ట్ర జనాభాలో 80 శాతం జనాభాను ఈ పథకం పరిధిలోనికి తీసుకు రావడం జరిగింది. దీని కోసం 2008-09 బడ్జెట్‌లో 471 కోట్ల రూపాయలను కేటాయించాము.

## ఉపాధి

> పని చేయడానికి ఇష్టపడి, పని దొరకని మనిషి బహుశా సూర్యుని క్రింద అదృష్టం అసమానతను ప్రదర్శించే దు:ఖతమయిన చూపు వంటి వాడు.
>
> -- థామస్ కార్లే

48. గ్రామీణ, పట్టణ, చదువుకున్న, చదువులేని . . . . . ఇలా ఏ వర్గంలో కూడా నిరుద్యోగం అనేది లేకుండా అందరికీ ఉపాధి కల్పించడం కోసం మేము బహుముఖ వ్యూహంతో కృషి చేస్తున్నాము. వ్యవస్థలో ఆర్థిక కార్యకలాపాలు పెంచడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచడం ఇందులో ఒకటి. సాగునీటి ప్రాజెక్టులు, ఇందిరమ్మ గృహాలు వంటివి భారీ స్థాయిలో చేపట్టడం ఈ కోవలోనిదే. ఉపాధి దృష్టితోనే కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం రెండోది, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇందులో భాగం. ఇక మూడోది, పారిశ్రామిక అవసరాలకనుగుణంగా శిక్షణ ద్వారా యువతను తీర్చిదిద్ది, వారికి ఉపాధి అవకాశాలు పెంచడం.

49. రాష్ట్రంలో ఒకవైపు ఇంజనీరింగ్, ఎం.బి.ఏ., ఎం.సి.ఏ. చదువుకున్న ఉన్నత విద్యావంతులు, తెలివైన వారు లక్షల మంది ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుండగా మరొక వైపు బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, బి.పి.ఓ. రంగాలలో చాలా పారిశ్రామిక సంస్థలు నైపుణ్యత కలిగిన మానవ వనరుల కోసం వెతుకుతున్నాయి. ఇందుకు కారణం విద్యార్థులు కళాశాలలో నేర్చుకున్న దానికి, పారిశ్రామిక సంస్థలు ఆశించే నైపుణ్యానికి మధ్య కొంత అగాధం ఏర్పడటమే. ఈ అగాధాన్ని పూడ్చి, అవసరమైన విషయాలలో యువతకు శిక్షణ నిచ్చి, వారిని నిపుణులుగా తీర్చిదిద్దడం కోసం, వచ్చే రెండు సంవత్సరాలలో వివిధ పరిశ్రమలలో ఉపాధిని పొందేలా 10 లక్షల మంది యువతకు

శిక్షణ ఇవ్వడానికి రాజీవ్ ఉద్యోగశ్రీ సొసైటీ పేరుతో ఒక సొసైటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ రంగాలలో 5 లక్షల మందికి, ఇతర రంగాలలో మిగతా 5 లక్షల మందికి ఉపాధి కల్పించడానికి వివిధ కార్యక్రమాలను రూపొందించాం. 2007-08 సంవత్సరంలో ఈ కార్యక్రమం కోసం 25 కోట్ల రూపాయల నిధులను విడుదల చేశాం. 2008-09 సంవత్సరంలో ఈ పథకం కోసం 130 కోట్ల రూపాయలు కేటాయించాము.

50. రాజీవ్ యువశక్తి పథకం ద్వారా స్వయం ఉపాధిని పెంపొందించడం కోసం, ఔత్సాహిక పారిశ్రామిక నైపుణ్యాలలో యువతకు శిక్షణ ఇవ్వడానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాం. ఈ కార్యక్రమం క్రింద, సిమెంట్ ఇటుకల తయారీ, కాంక్రీట్ మిక్స్ ప్లాంట్, సెంట్రింగ్ యూనిట్లు వంటివి ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక సహాయం అందిస్తున్నాము. 2008-09 సంవత్సరంలో శిక్షణ, స్వయం ఉపాధి పథకాల క్రింద 1.41 లక్షల మంది యువతకు సహాయం చేయడం కోసం 87.50 కోట్ల రూపాయలు కేటాయించాము.

51. మారుమూల, వెనుకబడిన ప్రాంతాలలో యువతను తీవ్రవాద ఉద్యమం వైపు ఆకర్షితులవకుండా నివారించి, వారికి ఉపాధి కల్పించడం కోసం పలు శిక్షణ, ఉపాధి కార్యక్రమాలు అమలు చేస్తున్నాము. 2006-07 సంవత్సరంలో 16,722 మంది యువకులకు శిక్షణనిచ్చి, 10,543 మందిని వివిధ సంస్థలలో నియమించడం జరిగింది. ప్రస్తుత సంవత్సరంలో 8,875 మందికి ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పించాము. మరో 5,355 మంది శిక్షణ పొందుతున్నారు. 2008-09 సంవత్సరంలో 87.50 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయింపులతో మారుమూల ప్రాంతాలలోని 75,000 మంది యువతకు శిక్షణ ఇవ్వాలని ప్రతిపాదించడమయింది.

52. జవహర్ నాలెడ్జి సెంటర్ కార్యక్రమాన్ని 294 కేంద్రాలు అమలు చేస్తున్నాయి. ఇందులో శిక్షణ పొందిన **7,648** మంది అత్యున్నత జీతాలు లభించే ప్రసిద్ధ సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఉద్యోగాలు పొందారు. ఇందులో కూడా చాలా మంది బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. ప్రస్తుత సంవత్సరంలో 79 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని విస్తరింప చేయడమయింది. వచ్చే సంవత్సరంలో దీనిని మరో 50 ప్రభుత్వ కళాశాలలకు విస్తరింప చేయనున్నాము. దీనివల్ల సాంకేతిక మరియు సంప్రదాయ పట్టభద్రులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఇందుకోసం 2008-09 బడ్జెట్‌లో 13 కోట్ల రూపాయలు కేటాయించాము.

**ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎ.పి.ఇ.ఆర్.జి.పి.)**

53. గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా ఉంది. డిమాండు కనుగుణంగా, పనిహక్కు ప్రాతిపదికగా ఉపాధి కల్పించే ఈ పథకం సామాజిక భద్రతను కల్పించే అత్యుత్తమ పథకం. రాష్ట్రంలో అమలవుతున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ఉపాధి హామీ పథకం 19 జిల్లాలలో 43,30,719 కుటుంబాలకు విస్తరించింది. ఇప్పటివరకు 66.90 లక్షల మంది దినసరి కూలీలకు ఉపాధి కల్పించి, ఈ ప్రయోజనం కోసం తెరిచిన పోస్టల్ సేవింగ్స్ అకౌంట్ల ద్వారా వారికి వేతనం అందించడం జరిగింది. ఈ సంవత్సరంలో ఈ పథకం క్రింద 1,313 కోట్ల రూపాయల ఖర్చుతో 12.67 కోట్ల పనిదినాలు కల్పించాము.

54. 2008-09 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని 1-4-2008 వ తేదీ నుండి మూడో దశ క్రింద మరో 3 జిల్లాలకు విస్తరించి సుమారు 80 లక్షల గ్రామీణ కుటుంబాలను ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చి, వారందరికీ 100 రోజుల ఉపాధి కల్పించాలని సంకల్పించాము. ఇందుకోసం 2008-09 సంవత్సరంలో ఈ పథకం క్రింద 3,000 కోట్ల రూపాయల ఖర్చు చేయాలని

ప్రతిపాదించాం. ఇందులో రాష్ట్ర వాటాగా 300 కోట్ల రూపాయలను 2008-09 బడ్జెట్ అంచానాలలో కేటాయించాము.

## గృహ నిర్మాణం

55. గ్రామీణ, పట్టణ ప్రాంతాల పేదలందరికీ గృహ వసతి కల్పించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యావత్ భారత దేశానికే ఆదర్శప్రాయంగా నిలచింది. ఇందిరమ్మ పథకం క్రింద 3 దశలలో రాష్ట్రమంతటినీ గుడిసె రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నాము. 2006-07 సంవత్సరంలో ఇందిరమ్మ మొదటి దశ క్రింద 5,141.26 కోట్ల రూపాయల ఖర్చుతో 19 లక్షల 74 వేల 749 గృహాలు మంజూరు చేయగా 2008, జనవరి నాటికి 11,86,031 గృహాలు పూర్తయ్యాయి. 2008, ఆగస్టు నాటికి మిగిలిన 7,88,718 గృహాలు పూర్తికాగలవని ఆశిస్తున్నాం. రెండో దశ క్రింద 25.71 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. 2008-09 సంవత్సరంలో ఈ గృహాలన్నింటిని పూర్తి చేయాలని కృత నిశ్చయంతో పని చేస్తున్నాము. ఇవే కాకుండా, ఇందిరమ్మ మూడో దశ పథకాన్ని మిగిలిన ప్రాంతాలలో 2008-09 సంవత్సరంలో అమలు చేస్తాము. మొత్తం మీద, 2008-09 ఆర్థిక సంవత్సరంలో మా ప్రయత్నాలను రెండింతలు చేసి కనీసం 30 లక్షల గృహాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. 2008-09 సంవత్సరంలో గృహ నిర్మాణానికి 5,850 కోట్ల రూపాయలు కేటాయించాము.

56. మా ప్రభుత్వం ఇందిరమ్మ పథకం క్రింద కేవలం గృహ నిర్మాణమే కాకుండా అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలను కూడా మంజూరు చేస్తోంది. 2006-07 నుంచి ఇప్పటి వరకు 4,24,724 మంది బలహీన వర్గాలకు చెందిన వారికి ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వడం జరిగింది.

విద్య

> మనిషి విజ్ఞానం కోసం డబ్బు ఖర్చు చేసినట్లయితే, ఆ విజ్ఞానాన్ని అతని నుండి ఎవరూ తీసుకోలేరు. విజ్ఞానం కోసం పెట్టే పెట్టుబడి ఎప్పటికీ మంచి ఫలితాన్ని ఇస్తుంది.
>
> -- బెంజిమన్ ఫ్రాంక్లిన్

57. ఆధునిక సమాజంలో ప్రజా జీవితాన్ని విద్య ఎంతగా ప్రభావితం చేయగలదో గౌరవ సభ్యులకు తెలుసు. అందుకే, తల్లిదండ్రులు, తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు శ్రమ పడుతున్నారు. అయితే, తమ పిల్లలకు చదువు చెప్పించలేని దైన్యస్థితిలో చాలా కుటుంబాలు ఉన్నాయి. ఇది ఎంతో దురదృష్ట కరం. ప్రతిభావంతుడైన ఏ విద్యార్థి కేవలం అతని లేదా ఆమె తల్లిదండ్రులు, వారి విద్య కోసం ఖర్చు చేయలేని కారణంగా, విద్యను కోల్పోకుండా చూడాలని మా ప్రభుత్వం నిశ్చయించింది. అందుచేత, దేశంలోనే మొట్టమొదటిసారిగా కుల, మత, వర్గ రహితంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఇచ్చే ఒక నూతన విధానాన్ని ప్రవేశ పెడుతున్నది. ఈ ప్రయోజనం కోసం 2008-09 బడ్జెట్‌లో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థుల స్కాలర్ షిప్పుల కోసం 25 కోట్ల రూపాయలు కేటాయించాము.

58. ప్రభుత్వం ఇప్పటికే ఎస్.సి., ఎస్.టి. లకు చెందిన అర్హులైన విద్యార్థులందరికీ స్కాలర్ షిప్పులు అందిస్తోంది. ఈ సంవత్సరంలో వెనుకబడిన తరగతులు, అల్ప సంఖ్యాక వర్గాలలో అర్హులైన విద్యార్థులందరికి స్కాలర్ షిప్పులు అందించాలని నిర్ణయించాము. అలాగే ట్యూషన్ ఫీజు రీఇంబర్స్‌మెంట్ ఎస్.సి., ఎస్.టి. విద్యార్థులతో సమానంగా, వెనుకబడిన తరగతులు, అల్ప సంఖ్యాక వర్గాల వారికి కూడా అందించాలని నిర్ణయించాము. అందుకనుగుణంగానే, వెనుకబడిన తరగతులు, అల్ప

సంఖ్యాక వర్గాల విద్యార్థులకిచ్చే స్కాలర్‌షిప్పుల కోసం 2007-08 బడ్జెట్‌లో కేటాయించిన 287 కోట్ల రూపాయలను, 2008-09 బడ్జెట్ అంచనాలలో 423 కోట్ల రూపాయలకు పెంచాము. అలాగే ట్యూషన్ ఫీజు రీఇంబర్స్‌మెంట్ మొత్తాన్ని కూడా 2007-08 సంవత్సరంలోని 50 కోట్ల రూపాయల నుంచి 2008-09 సంవత్సరంలో 185 కోట్ల రూపాయలకు పెంచాము.

59. వెనుకబడిన తరగతుల హాస్టల్ విద్యార్థులకిచ్చే డైట్ ఛార్జీలను మా ప్రభుత్వం ఒకటిన్నర సంవత్సరం క్రితం 25 శాతం పెంచింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు 40 శాతం, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 30 శాతం పెంచాలని నిర్ణయించాము. అలాగే హాస్టల్ విద్యార్థులకు అందిస్తున్న రెండు జతల యూనిఫారం స్థానంలో 4 జతల యూనిఫారంలను అందించాలని నిర్ణయించాము.

60. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో వెనుకబడిన తరగతులకు చెందిన కాలేజీ విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా ఒక హాస్టల్‌ను నిర్మించాలని నిర్ణయించాము. ఇందుకోసం 2008-09 సంవత్సరం బడ్జెట్‌లో 20 కోట్ల రూపాయలు కేటాయించాము.

61. ప్రభుత్వం 2015 సంవత్సరం నాటికి పూర్తి అక్షరాస్యతను సాధించాలన్న కృతనిశ్చయంతో పనిచేస్తున్నదని గౌరవ సభ్యులందరికీ తెలుసు. ఈ దిశగా ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాలు సత్ఫలితాలను సాధిస్తున్నాయి. ఇదే విషయాన్ని **ప్రథమ్** అనే స్వచ్ఛంద సంస్థ వార్షిక నివేదిక కూడా వెల్లడించింది. ఈ నివేదికలో ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక విద్యారంగంలో నాణ్యమైన విద్యను అందించడంలో గణనీయమైన అభివృద్ధిని సాధించిందని కూడా పేర్కొంది.

62. సెకండరీ స్థాయిలో విద్యను పటిష్టపరచాలనే ఉద్దేశంతో, కేంద్ర ప్రభుత్వం అనుమతించిన విధంగా విద్యాపరంగా వెనుకబడిన 737 మండలాలోని అన్ని ప్రభుత్వ, జిల్లాపరిషత్, పురపాలక పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లో 10వ తరగతి వరకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించాము. ఇందుకోసం 2008-09 సంవత్సరపు బడ్జెట్‌లో 853 కోట్ల రూపాయలు కేటాయించాము.

63. అదనపు తరగతి గదులు, ప్రయోగ శాలలు, గ్రంథాలయాలు మొదలగు మౌలిక సౌకర్యాలు కల్పించడంద్వారా రాష్ట్రంలో ఎంపికచేసిన పాఠశాలలను పటిష్టపరచాలని ప్రభుత్వం నిర్ణయించింది. పైన పేర్కొన్న సౌకర్యాలన్నింటినీ **SUCCESS** (స్కీమ్ ఫర్ యూనివర్సల్ యాక్సిస్ అండ్ క్వాలిటీ ఎట్ సెకండరీ స్టేజ్) అనే కార్యక్రమం క్రింద సమకూర్చుతామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వ సహాయంతో అమలు చేస్తాము. 2008-09 సంవత్సరపు బడ్జెట్‌లో ఈ పథకం కోసం వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాము. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా 250 కోట్ల రూపాయలు.

64. ఈ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం లేని విద్య పరిపూర్ణ విద్య కాదని గౌరవ సభ్యులందరికీ తెలిసిన విషయమే. ఈ దిశగా, రాష్ట్రంలో ఎంపిక చేసిన 5,000 ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో కంప్యూటర్ విద్యను బోధనాంశంగా చేర్చే కార్యక్రమాన్ని అమలుపర్చాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 2008-09 సంవత్సరపు బడ్జెట్‌లో 60 కోట్ల రూపాయలు కేటాయించడమయింది. ఈ ప్రాజెక్టుతో ప్రభుత్వ రంగం క్రింద రాష్ట్రంలో మొత్తం కంప్యూటర్ విద్యను బోధించే పాఠశాలల సంఖ్య 6,300 కు చేరుతుంది.

65. ప్రభుత్వ రంగంలో నడుస్తున్న 636 రెసిడెన్షియల్ పాఠశాలలో విద్య, మౌలిక సౌకర్యాలను మెరుగుపరచడం కోసం, సుమారు 5,350 కోట్ల రూపాయలతో

దశలవారీగా అమలు చేసేలా ఒక పథకాన్ని రూపొందించడమయింది. ఈ పథకం క్రింద సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నడిచే ఈ రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధి కోసం 2008-09 సంవత్సరపు బడ్జెట్‌లో 400 కోట్ల రూపాయలు కేటాయించాము.

66. పాఠశాల విద్యాశాఖకు మొత్తం కేటాయింపులు 2007-08 సంవత్సరంలో 6,181 కోట్ల రూపాయలు కేటాయించగా, 2008-09 సంవత్సరపు బడ్జెట్‌లో 8,655 కోట్ల రూపాయలు కేటాయించాము. ఇది 40 శాతం పెరుగుదలను సూచిస్తున్నది.

67. ఉన్నత విద్యా సంస్థలలో నాణ్యత, కాలమాన పరిస్థితులకు తగిన బోధనాంశాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించడంతోపాటు, విద్యావకాశాలు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన స్థాయిలో కల్పించి, ఉన్నత విద్యను అందరికీ చేరువలో ఉంచడం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నది.

68. ప్రభుత్వం ఇప్పటికే 4 కొత్త విశ్వవిద్యాలయాలు రాజమండ్రి, కడప, నల్గొండ, నిజామాబాద్‌లలో మంజూరు చేసింది. వీటికి అదనంగా, వచ్చే సంవత్సరంలో మరో మూడు నూతన విశ్వ విద్యాలయలను శ్రీకాకుళం, మహబూబ్‌నగర్, కర్నూలులలో ఏర్పాటు చేయాలని నిర్ణయించాము. ఇందుకోసం 2008-09 సంవత్సరం బడ్జెట్‌లో 15 కోట్ల రూపాయలు కేటాయించాము.

69. ఈ సంవత్సరం 3 విశ్వ విద్యాలయాలలో ఫైనాన్షియల్ సర్వీసెస్, మెడికల్ ట్రాన్స్‌క్రిప్షన్ అనే రెండు అంశాలలో ఫినిషింగ్ స్కూల్సు ప్రారంభించాం. ఈ ఫినిషింగ్ స్కూళ్ల పరిధిని 2008-09 సంవత్సరంలో విస్తృతం చేస్తాము. మారుమూల, గిరిజన ప్రాంతాలలో విద్యా సౌకర్యాలను మెరుగుపర్చడం కోసం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, వరంగల్, అదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో 5 కొత్త డిగ్రీ

కళాశాలలను మంజూరు చేశాము. పరిశోధనా కార్యకలాపాలను ప్రోత్సహించడం కోసం విశ్వ విద్యాలయాలలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించడమయింది.

70. అదిలాబాద్ జిల్లా బాసర, కడప జిల్లా ఇడుపుల పాయ, కృష్ణాజిల్లా నూజివీడు వద్ద మూడు ట్రిబుల్ ఐ.టి. లను (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ప్రకటించడానికి సంతోషిస్తున్నాను. ఇవి రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌కి అనుబంధంగా ఏర్పాటవుతాయి. ఈ ఇనిస్టిట్యూట్‌లలో కోర్సులు 2008-09 విద్యా సంవత్సరం నుండి ప్రారంభమవుతాయి. ఇందుకోసం 2008-09 సంవత్సరపు బడ్జెట్‌లో 320 కోట్ల రూపాయలు కేటాయించాము. ఈ ట్రిబుల్ ఐ.టి.లు త్వరలో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు బోధనా ఆలయాలుగా అవతరిస్తాయి.

## వైద్యం – ఆరోగ్యం

సంతోషం అంతటికి అంతర్గత నేపధ్యం ఆరోగ్యం

-- లీగ్ హంట్

71. దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స చేస్తూ నిరుపేదలకు సేవలను అందించాలనే ఉద్దేశంతో మా ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్నమైన, ఈ తరహా వాటిలో మొదటిది అయిన ఆరోగ్యశ్రీ ఆరోగ్య భీమా పథకం జాతీయ దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ పథకం దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే కుటుంబాలకు 2 లక్షల రూపాయల వరకు ఆర్థిక సంరక్షణను అందిస్తుంది. లబ్దిదారులందరి భీమా ప్రీమియంను ప్రభుత్వం చెల్లించే ఈ పథకాన్ని 2008, అక్టోబర్ 2 నాటికి రాష్ట్ర

మంతటికి విస్తరించాలని ప్రతిపాదించడమయింది. 2008-09 సంవత్సరంలో ఈ పథకం అమలు చేయడం కోసం 450 కోట్ల రూపాయలు కేటాయించాము.

72. వైద్య ఆరోగ్య శాఖ పనితీరులో నాణ్యతను పెంపొందించడం కోసం, ప్రభుత్వం ఈ శాఖకు ప్రణాళికా కేటాయింపులు 1,315 కోట్ల రూపాయలకు గణనీయంగా పెంచాలని ప్రతిపాదించింది. ఇందులో 117 కోట్ల రూపాయలు ఆంధ్రప్రదేశ్ వైద్యరంగ సంస్కరణల ప్రాజెక్టుకు కేటాయించడం జరిగింది. వైద్యరంగ సంస్థల నిర్వహణలో సమాజ భాగస్వామ్యాన్ని పెంచడం, ప్రభుత్వం గుర్తించిన ఆసుపత్రులలో అత్యవసర సేవలను మెరుగుపర్చడానికి నిధులను సమకూర్చడం, వైద్య సేవలు తక్కువగా ఉన్న ప్రాంతాలలో మెరుగైన సేవలను కల్పించడం ద్వారా గ్రామీణ జనాభాకు లబ్ధి చేకూర్చడానికిగాను ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగ సంస్కరణల ప్రాజెక్టుకు ఈ మొత్తాన్ని కేటాయించడమయింది.

73. గ్రామీణ ప్రాంతాలలో ఫిక్స్‌డ్ డే హెల్త్ సర్వీసును సమకూర్చడానికి **అత్యవసర సేవల నిర్వహణ మరియు పరిశోధనా సంస్థ** (ఇ.యం.ఆర్.ఐ) 108 ఉచిత సేవలతోపాటు 104 హెల్ప్‌లైన్ ద్వారా వినూత్న కార్యక్రమాలను ప్రారంభించింది.

74. 2008-09 సంవత్సరంలో అమలు చేయదల్చిన ముఖ్య కార్యక్రమాలు- హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో సూపర్ స్పెషాలిటీ ట్రామా బ్లాక్‌ను నిర్మించడం, బీబీనగర్ వద్ద గల రంగాపూర్‌లో నిమ్స్ యూనివర్సిటీని అభివృద్ధి పర్చడం, అదిలాబాద్, ఒంగోలు, శ్రీకాకుళంలలో ఏర్పాటు చేస్తున్న 3 కొత్త వైద్య కళాశాలలకు భవనాలు నిర్మించడం, అదిలాబాద్, శ్రీకాకుళంలలో కొత్త నర్సింగ్ కాలేజీలు, గుంటూరు, కర్నూలు, వరంగల్లులలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను అభివృద్ధిపర్చడం.

75. మారుమూల వెనుకబడిన ప్రాంతాలలో వైద్య సేవలు మెరుగుపర్చడం కోసం 29 కోట్ల రూపాయలు కేటాయించి రెండు ఏ.ఎన్.ఎమ్ శిక్షణ కేంద్రాలు, రెండు నర్సింగ్ శిక్షణ కళాశాలలు ఏర్పాటు చేయడంతోపాటు 60 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అదనపు భవనాలు నిర్మించాలని నిర్ణయించాము.

## సాంఘిక భద్రత, సమానత

76. సమాజంలో అసమానతలు తొలగించడం కోసం మా ప్రభుత్వం పెద్ద ఎత్తున్న భూ సంస్కరణలు చేపట్టి ఇప్పటివరకు, 4 విడతలుగా 6.04 లక్షల ఎకరాలకు పైగా భూమిని 4.33 లక్షల మంది భూమిలేని పేదవారికి పంపిణీ చేశాం. ఇందులో 1.26 లక్షల మంది షెడ్యూల్డు కులాల వారు, 1.06 లక్షల మంది షెడ్యూల్డు తెగలకు చెందినవారు, 1.48 లక్షల మంది వెనుకబడిన తరగతులకు, 53 వేల మంది ఇతర వర్గాలకు చెందినవారు. ఈ భూమిని అభివృద్ధి చేసి సాగు యోగ్యంగా చేసుకునేందుకు **ఇందిరప్రభ** పథకం క్రింద 300 కోట్ల రూపాయల ఖర్చుతో 3.85 లక్షల ఎకరాల భూమిని సాగులోకి తీసుకువచ్చే కార్యక్రమం జరుగుతుంది. వచ్చే సంవత్సరంలో 100 కోట్ల రూపాయలతో మరో లక్షా 59 వేల ఎకరాల భూమిని అభివృద్ధి చేసి సాగులోకి తేవాలని నిర్ణయించాము.

77. సమాజంలో ఏ ఆసరా లేని వృద్ధులు, అనాధలకు, అభాగ్యులకు, సామాజిక పింఛన్ల క్రింద ఆర్థిక సహాయం అందించే విషయంలో ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలచింది. రాష్ట్రంలో 47.89 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నాము. 2008-09 సంవత్సర బడ్జెట్లో పింఛన్ల కోసం 1,390 కోట్ల రూపాయలు కేటాయించాము. ఇందిరమ్మ 3వ దశ క్రింద మిగిలిన 3వ వంతు గ్రామాలలో రాబోవు సంవత్సరంలో అర్హులందరికీ పింఛనులు అందించి, పింఛనుల విషయంలో సంతృప్త స్థాయిని సాధిస్తాము. ఇంకా కళాకారులకు పింఛను కోసం

కేటాయింపులను ఈ సంవత్సరం 1.44 కోట్ల రూపాయల నుండి 2008-09 సంవత్సరంలో 6.44 కోట్ల రూపాయలకు పెంచామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

78. దిక్కులేని వారికి, అనాథలకు సహాయం అందించేందు కోసం దశలవారీగా ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గం లోను అనాథ శరణాలయాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కొరకు 2008-09 సంవత్సరం బడ్జెట్‌లో 22.50 కోట్ల రూపాయలను కేటాయించాము. మహిళా సాధికారతను పెంపొందించేందుకోసం మహాత్మాగాంధీ తన భార్య శ్రీమతి కస్తూరిబా జ్ఞాపకార్థం కస్తూరిబా గాంధీ మెమోరియల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. ఆ ట్రస్టు బ్రాంచి ఒకటి రంగారెడ్డి జిల్లాలో హైదర్షాకోటి వద్ద ఉండడం, అది ఇతర కార్యక్రమాలతోపాటు ఒక అనాధాశ్రమాన్ని నడుపుతుండడం, దిక్కులేని మహిళలకు, మానసిక మాంద్యులైన పిల్లలకు ఒక శిక్షణా కేంద్రాన్ని నడుపుతుండడం మన అదృష్టం. ఇటీవలె మహాత్ముని 60వ వర్ధంతిని సత్యనిష్ఠతో పాటించాం. దీనికి గుర్తుగా, హైదర్షాకోటి వద్ద గల కస్తూరిబా గాంధీ మెమోరియల్ ట్రస్టు కార్యక్రమాలకు మన మద్దతుగా 50 లక్షల ఏక మొత్తం గ్రాంటును అందజేయాలని మా ప్రభుత్వం నిర్ణయించింది.

79. చేనేతకారుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. చేనేతకారులకు ఆరోగ్య భీమాను వర్తింపజేస్తున్నాం. చేతి మగ్గాలను ఆధునీకరించేందుకోసం ఆర్థిక సహాయం అందించడంతోపాటు, నూలు కొనుగోలు కోసం సబ్సిడీని కూడా ఏర్పాటు చేస్తున్నాం. వారికి శిక్షణ ఇచ్చే పథకాన్ని, చేనేత రంగానికి మౌలిక సదుపాయాల మద్దతు పథకాన్ని కూడా అమలు పరుస్తున్నాం. అదే సమయంలో సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత సహకారసంఘాలను పునరుద్ధరించేందుకోసం కృషి చేస్తున్నాము. 2008-09 సంవత్సరం బడ్జెట్‌లో చేనేతకారులకు ఆర్థిక సహాయం అందించడం కోసం 34.40 కోట్ల రూపాయలను కేటాయించాము. చేనేతకారులకు

పావలా వడ్డీ పథకాన్ని అమలుపరచాలని కూడా ప్రతిపాదించడమయింది. ఈ పథకం అమలు కోసం 2008-09 సంవత్సరం బడ్జెట్‌లో 16.09 కోట్ల రూపాయలు కేటాయించాము.

80. సమాజంలోని అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తోంది. 2008-09 సంవత్సరపు బడ్జెట్లో మసీదులు, చర్చిల మరమ్మత్తుల కోసం 5 కోట్ల రూపాయలు కేటాయించాము. అల్పసంఖ్యాక వర్గాలలో సాముహిక వివాహాలు ప్రోత్సహించడం కోసం 5 కోట్ల రూపాయలు, క్రిస్టియన్‌ల తీర్థయాత్రల కోసం 2 కోట్ల రూపాయలు కేటాయించాము.

81. అడవులలో సంచార, స్థిర జీవనం కొనసాగిస్తున్న గిరిజన తెగలకు చెందిన ప్రజల హక్కుల పరిరక్షణ కోసం 2006, గిరిజన తెగల మరియు సంప్రదాయ అటవిక నివాసుల చట్టాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాము. ఇది గిరిజన జీవితాలలో విప్లవాత్మక మార్పులు తీసుకు రాగల చట్టం. 2008-09 సంవత్సరపు బడ్జెట్‌లో ఇందుకోసం 20 కోట్ల రూపాయలు కేటాయించాము.

## మహిళా సాధికారత

82. ప్రభుత్వం, గ్రామీణ పేదరికాన్ని రూపు మాపడం కోసం అంకితభావంతో కృషి చేస్తున్న **గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం** (సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ) ద్వారా గ్రామీణ ప్రాంతాలలో పేదరికం పారద్రోలడం కోసం మహిళలలో స్వయం సహాయక సంఘాలను మరియు వాటి సమాఖ్యలను ప్రోత్సహించడమనే సమర్థ వ్యూహాన్ని అమలుపరుస్తోంది.

83. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణం గణనీయంగా పెంచాము. ఇది 2001-02 సంవత్సరంలో 197.70 కోట్ల రూపాయలు కాగా 2006-07 సంవత్సరం నాటికి 3,063.87 కోట్ల రూపాయలకు పెరిగింది. 2007-08 సంవత్సరంలో 6,527 కోట్ల రూపాయల రుణాలు అందించేలా బ్యాంకులకు లక్ష్యాలు నిర్దేశించాము. 2008-09 సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాలలో స్వయం సహాయక సంఘాలలో 10,000 కోట్ల రూపాయల రుణాలు పొందేలా కృషి చేస్తాము.

84. మహిళా స్వయం సహాయక సంఘాలకు మా ప్రభుత్వం అందిస్తున్న గొప్ప కానుక పావలా వడ్డీ పథకం. ఈ పథకం క్రింద ఇప్పటివరకు సకాలంలో రుణాలు చెల్లించిన 11,61,883 సంఘాలకు 2007, డిశెంబర్ వరకు 172.70 కోట్ల రూపాయలు వడ్డీ సబ్సిడీ క్రింద అందించడం జరిగింది. 2008-09 సంవత్సరపు బడ్జెట్లో వడ్డీ సబ్సిడీ కోసం 250 కోట్ల రూపాయలు కేటాయించాము.

## గ్రామీణాభివృద్ధి

85. గ్రామీణ ప్రాంతాలలో రహదారి మౌలిక సౌకర్యాలను మెరుగుపరచేందుకు 2008-09 సంవత్సరపు బడ్జెట్‌లో 992.70 కోట్ల రూపాయలు కేటాయించాము. ప్రభుత్వం, గ్రామీణ ప్రాంతాలకు సురక్షిత త్రాగునీరు, పారిశుద్ధ్య వసతులు కల్పించడానికి నిబద్ధతతో కృషి చేస్తోంది. అందుకనుగుణంగా గ్రామీణ త్రాగునీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ పేరుతో సచివాలయంలో ఒక ప్రత్యేక శాఖను ఏర్పాటు చేశాము. 2008-09 సంవత్సరంలో 840 కోట్ల రూపాయల ఖర్చుతో 5,688 నివాస ప్రాంతాలకు మెరుగైన త్రాగునీరు వసతులు కల్పించాలని నిర్ణయించాము.

86. ఏకగ్రీవంగా ఎన్నికయిన గ్రామ పంచాయితీలకు ప్రోత్సాహక సహాయం క్రింద 150 కోట్ల రూపాయలు కేటాయించాము. కేంద్ర ప్రభుత్వం సమకూర్చే వెనుకబడిన ప్రాంతాల సహాయ నిధి క్రింద వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం 381 కోట్ల రూపాయలు కేటాయించాము. ఈ పథకం క్రింద అభివృద్ధిలో వెనుకబడిన జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది.

## పట్టణాభివృద్ధి

87. గత రెండు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ పట్టణీకరణ శరవేగంగా విస్తృతమవుతోంది. రోజురోజుకు పెరుగుతున్న పట్టణ జనాభాకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడం ఒక పెద్ద సవాలు వంటిది. పట్టణ మౌలిక వసతులు పెంపొందించడం కోసం ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన జవహర్‌లాల్ నెహ్రూ అర్బన్ రెన్యువల్ మిషన్ అనే పథకం ద్వారా పెద్ద మొత్తంలో నిధులు పొందడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ప్రభుత్వం ఈ పథకం క్రింద పట్టణాలలో నీటి సరఫరా, పరిశుభ్రత, రవాణా, మురికివాడల సమగ్రాభివృద్ధి, గృహ నిర్మాణం, ఇంకా ఇతర మౌలిక వసతులైన ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ వంటి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత నిస్తుంది. ఈ పథకం క్రింద పై కార్యక్రమాలకు సంబంధించి 208 ప్రాజెక్టులు 8,340.20 కోట్ల రూపాయల వ్యయంతో అనుమతి పొందాయి. వచ్చే సంవత్సరం బడ్జెట్‌లో ఈ కార్యక్రమాలకు 1500 కోట్ల రూపాయలు కేటాయించాము.

88. హైదరాబాద్‌ను ప్రపంచ శ్రేణి పట్టణంగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ ధ్యేయం. హైదరాబాద్ నగర చుట్టుప్రక్కల ప్రాంతాలలో పౌర, ఆర్థిక మౌలిక సౌకర్యాలు మెరుగు పరచి, నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి పర్చడం కోసం 2007 ఏప్రిల్‌లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేశాము.

89. సుమారు 4,000 కోట్ల రూపాయల వ్యయంతో ఔటర్ రింగురోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానం పెంచడం కోసం 600 కోట్ల రూపాయల ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు నిర్మిస్తున్నాము. 8,482 కోట్ల రూపాయల వ్యయంతో ట్రాఫిక్ అధికంగా ఉండే 3 మార్గాలలో రద్దీని తగ్గించడం కోసం సుమారు 66 కిలో మీటర్ల పొడవున హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు చేపడుతున్నాము. మెట్రో రైలు ప్రాజెక్టు ఏర్పాటు కవసరమైన భూమి సేకరణ మరియు ఇతర అవసరాల కోసం వచ్చే బడ్జెట్‌లో 150 కోట్ల రూపాయలు కేటాయించాము.

90. మా ప్రభుత్వం 1,082 కోట్ల రూపాయల వ్యయంతో కృష్ణా త్రాగునీరు సరఫరా పథకం 2వ దశ పనులను వేగంగా పూర్తి చేసి రోజుకు 90 మిలియన్ గాలన్ల నీటిని గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల కార్పొరేషన్‌కు చేర్చడం వలన ప్రతి రోజూ త్రాగునీటి సరఫరాకు అవకాశాలు ఏర్పడ్డాయి.

91. ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు, సేవలను పటిష్టపరచడం ద్వారా అన్ని పట్టణ స్థానిక సంస్థలలో రక్షిత మంచినీటిని సరఫరా చేయడానికి మా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నది. 2009-10 సంవత్సరం నాటికి సగటు తలసరి వినియోగం 158 లీటర్ల నీటిని అందించాలన్న ధ్యేయంతో పని చేస్తున్నాము. అంతేగాక, పట్టణ, స్థానిక సంస్థల పరిధిలోని అంతర్గత రోడ్లను అభివృద్ధి పరచి మౌలిక సౌకర్యాలు మెరుగుపర్చడం కోసం 200 కోట్ల రూపాయలు కేటాయించాము.

92. గ్రామీణ ప్రాంతాలలో ఇందిర క్రాంతి పథకం క్రింద స్వయం సహాయక సంఘాలు సాధిస్తున్న విజయాల స్ఫూర్తితో మా ప్రభుత్వం దానిని పట్టణ ప్రాంతాలకు కూడా **పట్టణ ఇందిరా క్రాంతి పథం** పేరుతో విస్తరింప చేయాలని నిర్ణయించింది.

పట్టణ మురికివాడలలోని లక్ష మంది మహిళలను సంఘాలుగా ఏర్పరచి, వారికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించడం ద్వారా వారి జీవన పరిస్థితులు మెరుగుపర్చి పేదరికం తొలగించాలని ప్రయత్నిస్తున్నాము. పట్టణ ప్రాంతాలలో పావలా వడ్డీ సబ్సిడీ కోసం 5 కోట్ల రూపాయలు కేటాయించాము.

93. మునిసిపలు పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖకు 2007-08 బడ్జెట్‌లో 1,843 కోట్ల రూపాయలు కేటాయించగా, దీనిని 2008-09 బడ్జెట్లో 3,136 కోట్ల రూపాయలుగా కేటాయించాము. పట్టణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించడం కోసం మేము నిబద్ధతతో కృషి చేస్తున్నామనడానికి ఇది నిదర్శనం.

## 2006-07 అకౌంట్లు

94. 2006-07 సంవత్సరంలోని తుది లెక్కలను బట్టి 2,807 కోట్ల రూపాయల రెవిన్యూ మిగులు తేలింది. మూలధన పద్దులు, ప్రభుత్వ రుణం, ప్రభుత్వ ఖాతాలోని లావాదేవీలన్నింటినీ లెక్కలోకి తీసుకున్న మీదట 281 కోట్ల రూపాయల లోటుతో ఈ సంవత్సరం ముగిసింది.

## 2007-08 సవరించిన అంచనాలు

95. 2007-08 సంవత్సరపు బడ్జెట్ అంచనాలను బట్టి 36 కోట్ల రూపాయల రెవిన్యూ లోటు ఉండగలదని భావించగా సవరించిన అంచనాలను బట్టి 451 కోట్ల రూపాయల మిగులు లావాదేవీలు సూచిస్తున్నాయి. సంవత్సరపు లెక్కలన్నిటినీ అంచనా వేయగా 267 కోట్ల రూపాయలు నికర మిగులు తేలింది. అయితే సంవత్సర

ప్రారంభంలో ఉన్న లోటు 281 కోట్ల రూపాయలను లెక్కలోకి తీసుకున్న మీదట 14 కోట్ల రూపాయల లోటుతో సంవత్సరం ముగియగలదని అంచనా వేయడమైంది.

## 2008&09 ºy|þ|s|ý A...^|þ¯éË$

96. 2008-09 ఆర్థిక సంవత్సరంలో ప్రణాళికేతర వ్యయం క్రింద 51,885 కోట్ల రూపాయలు, ప్రణాళికా పద్దు క్రింద 48,551 కోట్ల రూపాయలు వ్యయం చేయగలమని అంచనా. దీనివల్ల 709 కోట్ల రూపాయల రెవెన్యూ మిగులు తేలుతుంది. ఇది వార్షికోత్పత్తిలో 0.2 శాతంగా వుండవచ్చు. ద్రవ్య లోటు 9,657 కోట్ల రూపాయలు ఉండగలదని అంచనా. ఇది వార్షికోత్పత్తి (జి.స్.డి.పి)లో 2.82 శాతంగా ఉండవచ్చు. సంవత్సరం లావాదేవీలన్నిటినీ లెక్కలోకి తీసుకున్న మీదట 134 కోట్ల రూపాయల నికర మిగులు ఉండగలదని అంచనా. 2008-09 ఆర్థిక సంవత్సరము 120 కోట్ల రూపాయల మిగులుతో ముగియగలదని అంచనా.

97. అధ్యక్షా, ఇంతటితో నా ఈ బడ్జెటు ప్రసంగాన్ని ముగిస్తూ బడ్జెటును సభ వారి ఆమోదానికై సమర్పిస్తున్నాను.

**జైహింద్**